కవితా కౌముది

# మౌనం మాట్లాడితే_ _ _ శ్రీఅరుణం శ్రీనివాస్

మౌనాన్ని తక్కువగా చూడకు
బద్దలయ్యే అగ్నిపర్వతం కూడా కొంతకాలం మౌనిలానే కనిపిస్తుంది,
నోరు చెప్పటంలేదని...నిందలు వేసేద్దామనుకోకు,
గుండెలు దాచుకున్న వేదన శిఖలు...
కొండల్ని కూడా పిప్పిచేస్తాయని తెలుసుకో,
ఎవరూ చూడని అబద్ధాలు నువ్వే చెప్పి తప్పుకున్నాననుకోకు...
నిజాలు కుదిపేస్తుంటే...నిన్ను నువ్వు దహించుకోవటం దగ్గరైపోతుంది,
చావు అంచును చూసినవాడికి... స్మశానం ఒక లెక్కా...
కాగితాల కట్లు చూపి భయపెడితే
కాలానికి కూడా సమాధానం దొరకని ప్రశ్నలకు బందీవయిపోతావ్
కులం
మతం
డబ్బు
గర్వం
ప్రాంతం
రంగు
ఎప్పుడూ కన్నీళ్లకు ఆసరా కాలేవు,
నువ్వనే స్థాయి మారితే...అవన్నీ...దూరంగా ఎగిరిపోతాయి,
ఆదర్శం ఒక్కటే చీకటిలో చిగురించే వెలుగు కొమ్మ
అదృష్టం కలిసొస్తే...ఆధారమే దొరుకుతుంది
ఆశయం కూడా తోడయితేనే... ఆ తత్వం గెలుస్తుంది,
విరగబడే ప్రతి నవ్వుకూ సమాధానం చెప్పక్కరలేదు
విషయం మంచిగ నీ తోడుంటే...
మౌనం కూడా విశ్వానికి నువ్వనే సమాధానమవుతుంది



★★★

# ఇంకెంత దూరం తమ్ముడూ..! డా.మూర్తి జొన్నలగెడ్డ

తమ్ముడూ ... ఇంకెంత దూరం ... తమ్ముడూ!
నా గుండె నిండా నిండిన
నా బాల్యమంతా పండిన
నా ఊరు ఇంకెంత దూరం ... తమ్ముడూ!
ఉనికి కోసం పోరు సలుపుతు
బ్రతుకు బాటన పొలిమేర దాటా
దూర భారాలెన్నో చూసి మోశా
ఎత్తు పల్లాలెన్నో ఎగసి దుమికా!!
దివా రాత్రములు రణము సలిపా
ఓడినా వీడక గెలుపుకై వేడక
నన్ను నేను నమ్ముకుంటూ
నన్ను నేనే గెల్చుకుంటూ..!!
గెలుపు వెంట గజిబిజిగా
గతమంతా మరచి పోగ
గురుతు లేని గురుతు రాని
విజయ పథాలెన్నిటనో విహరించా..!!
ఇక అలసి అట్లే వాలి ఆకసం వైపు చూశా
ధృవ తారను చూడగనే తళుక్కు మంది
తలపులలో, నా ఉనికికి మారు పేరు
నే పుట్టిన నా సొంత ఊరు.!!
తమ్ముడూ ... ఇంకెంత దూరం ... తమ్ముడూ!
నా గుండె నిండా నిండిన
నా బాల్యమంతా పండిన
నా ఊరు ఇంకెంత దూరం ... తమ్ముడూ!!
ఈ దారి పరిచయమున్నట్టు లేదు
ఈ ఎల్లలు ఇదివరకున్నట్టు లేవు
పాత పరిచయాలు కొత్తగా చేసుకోవడం
పాత పరిసరాలు కొత్తగా చూసుకోవడం..!!
మళ్ళీ నేను చిన్నవాడనై నట్లుంది
పాత కొత్త, పాత గుబులునే పుట్టిస్తోంది
గుండె గుబులైనప్పుడల్లా
నా కొత్త పాత ఇంటికి అతిథినౌతున్నా

శభాష్ తమ్ముడూ శభాష్!
కొత్త సమస్యకు కొత్త పరిష్కారమా!
వలయంలా తిరిగే ఈ కాలానికి
పాత కొత్తలు పగలు రాత్రులా!

పగలు రేయిని కలిపి చూసిన
ఒకే దినముగ నిలచి పోవును
పాత కొత్తల కలిపి నిలిపిన
ఒకే పయనముగ సాగిపోవును

పాత కొత్తల కలిపి నిలచినది
నడుమ పండిన నా జీవితం
అదే చూపును నాకు దారి
అటే సాగును ఈ బాటసారి

తమ్ముడూ ... ఇంకేమి దూరం ... తమ్ముడూ!
నా గుండె నిండా నిండిన
నా బాల్యమంతా పండిన
నా ఊరు నాకేమి దూరం ... తమ్ముడూ!

★★★

# అభిలాష

రవి కిషోర్ పెంట్రాల

అఖిల తారలు
నీ పదపద్మములను జేరి
అమితానురక్తితో కొల్చుటజూచి
పూటపూటనా ఇలాగ
మినుకుమినుకుమని మెరయుచుంటి

విశాలాకాశానున్న నక్షత్రమండలాన
నేటికిలా చుక్కనై ఉదయించితి
ఇన్నాళ్లూ ప్రవేశం నిషేధించితివి
తగననా నీ పవిత్ర పాదపూజకు?

తూర్పుదిశను దొరికించుకొని
ఆకాశానికి మిక్కిలి శ్రమతో ప్రాకిప్రాకి
పశ్చిమసంద్రంలో పడిమునిగి
మరలమరల ఉదయాస్తమయాల
చట్రంలో తిరగుతున్నా, ఇంతేనా బ్రతుకు?

భవసాగరమును తప్పుకొనుటకు
తగిన ఉపాయం దొరకదా
ఊరట కలగదా నీకిష్టమైతే
నీ చల్లని చూపు సోకితే మాత!

తారలందరూ నడిచిన త్రోవలను
వారు చేసిన ఆరాధనల తీరునిజూచి
అనునిత్యం నీ సేవలో తరించాలని
తత్తరపడుతున్న పసితారకను!

ఆత్మపీఠమందు సదా నిన్నుంచి
నిష్ఠతో సర్వదా అర్చించదలచితినే
నా ఆశ పేరాసనకుమమ్మా
నను కరుణించి బ్రోవుమమ్మా
నువ్వు తప్ప నాకెవ్వరే దిక్కమ్మా?
ఓ నిఖిలజననీ ఆదిశక్తి పరాశక్తి!!

'వేంకట పార్వతీశ కవులు' గారి 'అనుతర్షము' కవితకి అనుసరణ



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఏల జీవించవలయునీ నేలపైన
ఏమి యాశించి యుందుమీ భూమియందు
ఒక్కటే తోచునీ ప్రశ్నకుత్తరమ్ము
చిత్తమందుననానందసిద్ధి కొఱకు

ఒరులకిచ్చుటయందు దాగున్న శాంతి
తిరిగి పొందెడు ప్రేమలో తీయదనము
ఆప్తజనములు పంచెడునమృతధార
చేయు సార్థకమిచ్చటి జీవితమును

విధులు సక్రమరీతి గావించినపుడు
అంతరంగము సంతృప్తినందినపుడు
సృష్టిశోభలనెదను వీక్షించినపుడు
తోచునానందమే పారితోషికమ్ము

ఎపుడు సద్ధర్మ్యమొకటి సాధించు కాంక్ష
యుక్తజనులకు చేయూతనొసగు వాంఛ
తలపునందుననెపుడు చిప్పిలెడు కరుణ
భూనభమ్ముల గాంచి యుప్పొంగు మనసు

బ్రతుకు పయనమ్మునకివి సార్థకతనొసగు
అర్థరహితమౌ మనుగడకర్థమొసగు
చిన్న సద్భావనలె మన చిత్తమునకు
శాంతిసంయమనానంద సాధకములు

COMMENTS